క్లుప్తంగా

226 మందికి నేత్ర వైద్య పరీక్షలు



రూడకోట పీహెచ్‌సీలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ముంచంగిపుట్టు: మండలంలోని లబ్బూరు, రూడకోట పీహెచ్‌సీలలో సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విజయనగరం శ్రీవెంకటేశ్వర పుష్పగిరి కంటి ఆసుపత్రి సహకారంతో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కంటి సమస్యలతో బాధపడుతున్న 226 మందికి పరీక్షలు చేశారు. అవసరమైన మందులు అందజేశారు. ఈ సందర్భంగా మండల ఆప్తమాలిక్ అసిస్టెంట్ కిషోర్‌కుమార్ మాట్లాడుతూ తీవ్రమైన కంటి సమస్యతో బాధపడుతున్న 62 మందికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించామని, వారిని బస్సులో విజయనగరం తరలించామని, శస్త్ర చికిత్సల సమయంలో ఉచితంగా భోజనం, వసతి మూడు రోజుల పాటు కల్పిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి సత్యారావు, పుష్పగిరి కంటి ఆసుపత్రి వైద్యాధికారిణి హైనదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు సీడీపీవోగా విమలకుమారి



ముంచంగిపుట్టు: మండల చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు ఆఫీసర్(సీడీపీవో)గా యూ.విమల కుమారి నియమితులయ్యారు. శ్రీకాకుళం జిల్లా కొత్తూరులో సీడీపీవోగా పని చేస్తున్న విమలకుమారి బదిలీపై ఇక్కడికొచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ సీడీపీవోగా పని చేసిన వరహాలలమ్మను విజయనగరం జిల్లా బాడంగికి బదిలీ చేశారు. నూతన సీడీపీవో విమలకుమారి మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారం అందేలా పని చేస్తానని, అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షిస్తూ, కేంద్రాలు పని తీరు మెరుగుపరుస్తానని చెప్పారు. మండల ప్రజలంతా అన్ని విధాలుగా సహకరించాలని ఆమె కోరారు.

హెల్త్ ఎడ్యుకేటర్‌గా సత్యవతి



సత్యవతి

రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్‌గా పి.సత్యవతి నియమితులయ్యారు. ఆమె సోమవారం పాడేరు డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో నియామక పత్రం తీసుకొని రాజవొమ్మంగి వచ్చారు. ఆమె ఇప్పటి వరకు కాకినాడలోని డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ హెల్త్ ఎడ్యుకేటర్‌గా పని చేసిన సుధాకర్ కాకినాడ డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయానికి బదిలీ అయ్యారు.

రంపచోడవరం తహసీల్దార్‌గా బాలాజీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న బాలాజీ

రంపచోడవరం: రంపచోడవరం తహసీల్దార్‌గా పని చేసిన పి.రామకృష్ణను తూర్పుగోదావరి జిల్లా గోకవరం బదిలీ అయింది. ప్రస్తుతం మారేడుమిల్లి తహసీల్దార్ సీహెచ్ బాలాజీకి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది తహసీల్దార్‌ను శుభాకాంక్షలు తెలిపారు.

వ్యవసాయ శాఖ ఏవోగా సుజాత



బాధ్యతలు స్వీకరిస్తున్న సుజాత

వై.రామవరం: వై.రామవరం మండల వ్యవసాయ శాఖ ఏవోగా ఎం.సుజాత సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె రామచంద్రపురం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటి వరకు వై.రామవరం ఏవోగా పనిచేసిన ఉషారాణి కృష్ణా జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన ఏవో సుజాత ఎంపీడీవో కె బాపన్నదొరను కలసి. సిబ్బందితో సమావేశం నిర్వహించి, అందరిని పరిచయం చేసుకున్నారు.

నేడు సామాజిక తనిఖీ ప్రజావేదిక

అడ్డతీగల: జాతీయ ఉపాధి హామీ పథకం కింద నిర్వహించిన వివిధ పనులపై అడ్డతీగలలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక సదస్సు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.ఆర్.విజయ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ఈ సదస్సు జరుగుతుందన్నారు. సామాజిక తనిఖీ బృందాలతో జూన్ 1 నుంచి 22 వరకూ మండల పరిధిలోని పంచాయతీల్లో సామాజిక తనిఖీ నిర్వహించి తుది నివేదిక తయారు చేశామన్నారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకూ మండల వ్యాప్తంగా జరిగిన రూ.13 కోట్ల విలువైన పనులపై నివేదిక సమర్పిస్తారన్నారు.

నిలిచిన సేవలు.. తప్పని అవస్థలు

- ఉత్సవ విగ్రహాల్లా బీఎస్ఎన్ఎల్ టవర్లు
- తరచూ సేవలకు అంతరాయం
- నష్టపోతున్న వినియోగదారులు

వై.రామవరం: ఇంటర్నెట్ సమస్య మన్యం ప్రాంతాన్ని పట్టి పీడిస్తోంది. ముఖ్యంగా బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్, సెల్ సేవలు వినియోగదారులను ఎంతో నిరుత్సాహపరుస్తున్నాయి. సెల్‌ఫోన్లు పనిచేయక, ఇంటర్నెట్ సేవలు తరచూ మొరాయిస్తుండడంతో ఎంతో ముఖ్యమైన పనులు నిలిచిపోతున్నాయి. అత్యవసర సమయంలో 108 అంబులెన్స్‌కు కూడా సమాచారం ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. వై.రామవరం మండలంలో సుమారు 25 వరకు బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు ఉన్నాయి. మండల కేంద్రమైన వై.రామవరంలో సెల్ టవర్‌తో పాటు బీఎస్ఎన్ఎల్ టెలికం ఎక్స్ఛేంజి కూడా ఉంది. అయినా సేవలు అంతంత మాత్రంగా అందుతున్నాయి. కరెంటు పోతే జనరేటరు పనిచేయక సేవలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. బీఎస్ఎన్ఎల్ శాశ్వత సిబ్బంది వీఆర్ఎస్ తీసుకోవడంతో టెలికం ఎక్స్ఛేంజిని పట్టించుకునే నాథుడు కరువయ్యారు. సేవలు నిలిచిపోతే ఎవర్ని అడగాలో తెలియని దుస్థితి ఉందని పలువురు వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అందని ఓటీపీలు.. రాని మెసేజీలు

మండల కేంద్రమైన వై.రామవరంతో సహ మండలంలోని అన్ని సెల్ టవర్లు వినియోగదార్లకు మెరుగైన సేవలు అందించకుండా ఉత్సవ విగ్రహాల్లా దర్శనమిస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో మొదట బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్లు మాత్రమే నిర్మించడంతో మండల ప్రజలంతా ఆ సిమ్‌లు మాత్రమే తీసుకున్నారు.



వై.రామవరంలో బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్, ఎక్స్ఛేంజి కార్యాలయం

తరచూ సేవలకు అంతరాయం



నిరంతరం సేవలు అందించడంలో బీఎస్ఎన్ఎల్ సంస్థ పూర్తిగా విఫలమైంది. మెరుగైన సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. శాశ్వత సిబ్బందిని నియమించి మెరుగైన సేవలు అందించాలి.

– కడబాల ఆనందరావు, ఎంపీపీ, వై.రామవరం

మెరుగైన సేవలకు చర్యలు అవసరం



బీఎస్ఎన్ఎల్ సేవలు సక్రమంగా అందకపోవడంతో మెసేజీలు రాక ముఖ్యమైన పనులు నిలిచిపోతున్నాయి. సుమారు మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఉంది. తక్షణమే ఆ సంస్థ ఉన్నతాధికారులు స్పందించి మెరుగైన సేవలు అందించడానికి తగు చర్యలు తీసుకోవాలి.

– వీరమళ్ళ సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ, వై.రామవరం

ఆధార్, పాన్, బ్యాంకు ఖాతాలతో పాటు అన్నింటికీ బీఎస్ఎన్ఎల్ మొబైల్ నంబర్లు మాత్రమే లింకు చేసుకున్నారు. అయితే సక్రమంగా సేవలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓటీపీలు, ముఖ్యమైన మెసేజీలు రాకపోవడంతో పలు పనులు నిలిచిపోతున్నాయని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెలలో కనీసం 10 రోజులు కూడా సక్రమంగా బీఎస్ఎన్ఎల్ సేవలు అందడం లేదు. నెల, రెండు నెలలకు, అంతకంటే ఎక్కువ కాలం ఒక్కసారిగా రీచార్జి చేయించుకోవడంతో అటు సేవలు అందక, ఇటు డబ్బులు నష్టపోతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బీఎస్ఎన్ఎల్ సేవలు సక్రమంగా అందించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రమేష్

కొయ్యూరు: చీడిపాలెం పంచాయతీ సింగవరం రైతు సేవా కేంద్రంలో రైతులకు సోమవారం ఎంపీపీ బడుగు రమేష్ విత్తనాలు పంపిణీ చేశారు. మండలానికి దాదాపుగా 800 క్వింటాళ్ల వరకు విత్తనాలు అవసరం కాగా.. 654 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. దీనిపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌జీఎల్ ఎక్కువగా కావాలని రైతులు అడుగుతున్నారు. అయితే ఆ విత్తనాలు చాలా తక్కువగా వచ్చాయి. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఏవో ప్రియాంక ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండో దఫాలో విత్తనాలు వస్తాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో మునుపటి ఏవో ఉమాదేవి, మర్రివాడ ఎంపీటీసీ గంగాభవానీ, సర్పంచ్ ఎస్.సోమన్నదొర పాల్గొన్నారు

ఐదో తరగతి వరకు కొనసాగించాలని విజ్ఞప్తి

రంపచోడవరం: స్థానిక ఎస్టీ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో మూడు నుంచి ఐదు తరగతులు వరకు కొనసాగించాలని పీడీఎస్‌యూ నాయకుడు పల్లాల అశోక్ ఓ ప్రకటనలో కోరారు. ఎస్టీ కాలనీలోని ఎంపీపీ పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులు నిర్వహించే వారని, గత ఏడాది నుంచి 3 నుంచి ఐదు తరగతులు రద్దు చేసి కిలోమీటరు దూరంలోని ఉన్న అంబేడ్కర్ సెంటర్‌లోని పాఠశాలలో విలీనం చేశారని గుర్తు చేశారు. దీని వల్ల విద్యార్థులు నడిచివెళ్లి రావడం చాలా కష్టంగా ఉందన్నారు. ఇప్పటికే అనేకసార్లు ఐటీడీఏ పీవో, ఎంఈవోలకు వినతి పత్రాలు అందించామన్నారు.

పోలవరం నిర్వాసితుల స్థల పరిశీలన

చింతూరు: పోలవరం ముంపులో భాగంగా ఫేజ్–1బీలో చేర్చిన చింతూరుకు చెందిన గిరిజనేతర నిర్వాసితులు సోమవారం బస్సులో తరలి వెళ్లి ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం మండలం తాడువాయి వద్ద పునరావాస కాలనీల నిర్మాణాలకు కావాల్సిన స్థలాన్ని పరిశీలించారు. తాడువాయి గ్రామం పక్కనే ఉన్న వంద ఎకరాలను నిర్వాసితులు పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ అధికారులు రెండు ప్రాంతాల్లో స్థలాలు చూపించారని, రెండింట్లో ఏది ఆమోదయోగ్యంగా ఉంటే ఆ విషయాన్ని అధికారులకు తెలియజేస్తామని చెప్పారు. చింతూరుకు చెందిన పోలవరం నిర్వాసితులైన గిరిజనులకు రంపచోడవరం డివిజన్‌లోని గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి ప్రాంతాల్లో కాలనీ నిర్మాణాలకు, గిరిజనేతరులకు గోకవరం సమీపంలోని సూదికొండ, ఏలూరు జిల్లా తాడువాయి ప్రాంతాల్లో పునరావాస కాలనీలు నిర్మించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనిలో భాగంగా సోమవారం గిరిజనేతరులను తాడువాయి సమీపంలో స్థలాలను పరిశీలించేందుకు తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం హౌసింగ్ ఈఈ ప్రసాదరావు, డీఈ వర్మ, ఎస్‌డీసీ చంద్రశేఖర్, తహసీల్దార్ చిరంజీవి, ఆర్‌ఐ విగ్నేష్, వీఆర్‌వో రామచంద్రం పాల్గొన్నారు.



తాడువాయిలో స్థలాలు పరిశీలిస్తున్న గిరిజనేతర నిర్వాసితులు

రాయితీపై వ్యవసాయ పరికరాల అందజేత

చింతపల్లి: గిరిజన రైతులు ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న వ్యవసాయ యంత్రాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు సూచించారు. సోమవారం గొందిపాకలు గ్రామంలో రైతులకు వ్యవసాయ పరికరాలను పంపిణీ చేశారు. గతేడాది పంపిణీ చేసిన వ్యవసాయ పరికరాలను పరిశీలించారు. ఈ ఏడాది 200 పవర్ వీడర్లు పంపిణీకి ప్రతిపాదనలు చేసినట్లు ఏవో తెలిపారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే రైతులకు అవసరమైన పచ్చిరొట్ట ఎరువులు, వరి, వేరుశనగ, తదితర విత్తనాలను కూడా పంపిణీ చేశామన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఏ శోభన్, తదితరులు పాల్గొన్నారు.



గొందిపాకులు గ్రామంలో రైతులకు యంత్రాలు అందిస్తున్న వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు

ఏజెన్సీలో అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలి

రంపచోడవరం: రంపచోడవరం మండలం బొర్నగూడెం గ్రామంలో జరుగుతున్న అక్రమ మైనింగ్ తవ్వకాల దగ్గర గోతిలో పడి బాలుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్న సంఘటనపై విచారణ జరిపించాలని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు డిమాండ్ చేశారు. బాలుడికి మెరుగైన వైద్యం అందించాలని, దీనికి కారకులైన వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో అక్రమ మైనింగ్‌లను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. రంపచోడవరం, అడ్డతీగల, గంగవరం, చింతూరు ఎటపాక మండలాల్లో గిరిజన చట్టాలకు విరుద్ధంగా ఎటువంటి అనుమతులు లేకుండా జరుగుతున్న అక్రమ మైనింగ్, నల్లరాయి క్వారీలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అక్రమ మైనింగ్‌పై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

చింతపల్లి: సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్‌వీ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజా రవీంద్ర చౌదరి అన్నారు. సోమవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని అన్ని గిరిజన ఆశ్రయ పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. వాటి నుంచి రక్షణగా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ పాఠశాలలు వార్డెన్‌లు నూకరత్నం, గణేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఏఎన్ఎం లక్ష్మమ్మ, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రాజారవీంద్ర చౌదరి

శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



బుల్లోజిపాలెంలో శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



రంపచోడవరంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న బీజేపీ నాయకులు

వై.రామవరం: శ్యామ ప్రసాద్ ముఖర్జీ బలిదాన్ దివస్ సందర్భంగా వై.రామవరం మండలం బుల్లోజిపాలెం గ్రామంలో సోమవారం ఆయన చిత్రపటానికి బీజేపీ నాయకుడు కారం సీతారామన్నదొర, పార్టీ మండల అధ్యక్షుడు ఆది విష్ణు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దేశ సమగ్రత కోసం పోరాడిన వ్యక్తి ముఖర్జీ

రంపచోడవరం: దేశ సమైక్యత, సమగ్రత కోసం పోరాటం చేసిన మహోన్నత దేశ భక్తుడు డా. శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ అని బీజేపీ నాయకులు అన్నారు. రంపచోడవరంలో సోమవారం బలిదాన్ దివస్ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ముఖర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ కన్వీనర్ ఈక బుల్లికొండలుదొర, పార్టీ నాయకులు కారం సీతారామన్నదొర, కుండ్ల కృష్ణారెడ్డి, కుంజ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను రెన్యువల్ చేయాలి

జి.మాడుగుల: ఆదివాసీ మాతృబహుభాషా మండల ఉపాధ్యాయులను ప్రభుత్వం తక్షణమే రెన్యువల్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆదివాసీ మాతృభాషా మండల ఉపాధ్యాయుల సంఘం ఉపాధ్యక్షురాలు సీదరి చిన్నమ్మి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఆదివాసీ మాతృబహుభాషా ఉపాధ్యాయులు సేవలందిస్తున్నారని, 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభమై 10 రోజులు కావస్తున్నప్పటికీ ఇంతవరకు వారిని విధుల్లోకి తీసుకోలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలో 1327 మంది ఆదివాసీ మాతృబహుభాషా ఉపాధ్యాయులు పని చేస్తున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా విధుల్లోకి తీసుకోవాలని చిన్నమ్మి కోరారు.

ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి

ఎటపాక: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రంపచోడవరం నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు దామెర్ల రేవతి సోమవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఏడాది కాలంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు చెల్లింపులు, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రావటానికి అమలు కాని హామీలు ఇచ్చి ప్రజలను, యువతను మోసం చేస్తున్నారని ఆమె విమర్శించారు.

నిబంధనల మేరకు బదిలీలు చేపట్టాలి



డీఆర్వో పద్మలతకు వినతిపత్రం అందిస్తున్న యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ నాయకులు

పాడేరు : విద్యుత్ సంస్థలో పని చేస్తున్న ఎనర్జీ అసిస్టెంట్స్, గ్రేడ్–2 జేఎల్ఎంలకు విద్యుత్ సంస్థ నిబంధనల మేరకు బదిలీలు చేపట్టాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ కార్యదర్శి ఆర్.సత్యారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం డీఆర్వో పద్మాలత, విద్యుత్ సంస్థ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. రేషనలైజేషన్ పద్ధతి వర్తింపజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సుందర్‌రావు, గ్రేడ్–2 జేఎల్ఎంలు పాల్గొన్నారు.

'ఉపాధి' పనుల్లో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- డ్వామా పీడీ విద్యాసాగర్ హెచ్చరిక
- గంగవరంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక సదస్సు

గంగవరం : ఉపాధి హామీ పనుల్లో అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని డ్వామా పీడీ డి.వి.విద్యాసాగర్ అన్నారు. సోమవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం 17వ విడత సామాజిక తనిఖీ మండల ప్రజావేదిక సదస్సును స్థానిక ఉపాధి హామీ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్దేశించిన ఉపాధి హామీ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం లక్ష్యం నెరవేర్చడం కోసం గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి, జిల్లా స్థాయి వరకు అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. పనుల నిర్వహణ, కూలీలకు వేతనాలు చెల్లింపుల్లో స్వలాభం కనిపిస్తే అటువంటి వారిపై చర్యలు తప్పవన్నారు. పనుల్లో అక్రమాలు జరిగినట్లు గుర్తిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మండలంలో 17 పంచాయతీలలో 8 వేల జాబ్ కార్డులు ద్వారా సుమారు 11 వేల మంది పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారన్నారు. 2024–25లో ఉపాధి హామీ పథకం ద్వారా 17 పంచాయతీల్లో రూ.17 కోట్ల మేర పనులు జరిగాయిని, దీనిపై సోషల్ ఆడిట్ నిర్వహించామన్నారు. గ్రామ స్థాయిలో 21 రోజులుగా సామాజిక తనిఖీ ఎస్ఆర్పీ పున్నపునాయుడు ఆధ్వర్యంలో ఆడిట్ బృందాలు తనిఖీలు నిర్వహించాయన్నారు. ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు నిర్వహణలో మండలాన్ని ముందుకు తీసుకెళ్లాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. జెడ్పీటీసీ సభ్యురాలు బేబీ రత్నం మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి పని కల్పించాలని కోరారు. ఎంపీడీవో వై.లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం లక్ష్యాన్ని వివరించారు. ఉపాధి హామీ ఏపీడీ ఎల్.రాంబాబు, ఎస్‌టీఎం సత్యనారాయణ, విజిలెన్స్ ఆఫీసర్(పాడేరు) వి.సురేష్‌కుమార్, ఏపీవో ప్రకాష్, ఏపీఎం షణ్ముఖరావు, వైస్ ఎంపీపీ గంగాదేవి, సర్పంచులు అక్కమ్మ, పార్వతి, మాజీ ఎంపీటీసీ బుల్లియమ్మ, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డ్వామా పీడీ విద్యాసాగర్, ఎంపీపీ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ బేబీ రత్నం

వీడని ముసురు.. స్తంభించిన జనజీవనం



ముంచంగిపుట్టులో వర్షంతో గొడుగులు పట్టుకొని పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు



పెదబయలుకు వెళ్లే మార్గంలో బురదగా మారిన మట్టి రోడ్డు

ముంచంగిపుట్టు: రెండు రోజులుగా వర్షాలు పడుతుండడంతో జన జీవనం స్తంభించిపోయింది. బయటకు వచ్చేందుకు వీలులేని విధంగా చల్లటి గాలులతో వర్షం కురుస్తూ ఉండడంతో మండల వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఉపాధ్యాయులు నానా అవస్థలు పడ్డారు. మండలంలోని లక్ష్మీపురం, బుంగాపుట్టు, భూసిపుట్టు, రంగబయలు పంచాయతీల్లో పిల్ల కాలువలు వరదనీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. సుజనకోట, పెదగూడ, దార్లెల, జోలాపుట్టు, వనసుపుట్టు పంచాయతీల మీదుగా ప్రవహిస్తున్న మత్స్యగెడ్డలోకి భారీగా వరద నీరు చేరుతోంది.

చిత్తడిగా మారిన వారపు సంత

పెదబయలు: మండలంలో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. స్థానిక పాత ఎంపీడీవో కార్యాలయం సమీపం నుంచి వారపు సంతకు వెళ్లే మట్టి రోడ్డు వర్షానికి బురదగా మారింది. సంతకు సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని అనేక మార్లు అధికారులకు విన్నవించినా స్పందన కరువైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో సంతకు రూ.40 లక్షలతో షెడ్, ఎంపీ నిధులతో బోర్ వెల్ సదుపాయం కల్పించారని, కూటమీ ప్రభుత్వం సీసీ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.



పెదబయలు సంతలో వర్షానికి గొడుగులు వేసుకుని వచ్చిన వినియోగదారులు

గొడుగుల సంత

పెదబయలు: మండలంలో రెండు రోజుల నుంచి వర్షం కురుస్తోంది. సోమవారం పెదబయలు వారపు సంతకు ప్రజలు గొడుగులు వేసుకుని రావడంతో సంత అంత గొడుగులతో నిండిపోయింది. రంగు రంగుల గొడుగులతో సంత ఆకట్టుకుంది.

సీలేరులో చిరుజల్లులు

సీలేరు: గూడెం కొత్తవీధి మండలం సీలేరులో ఉదయం 10 గంటల నుంచి చిరుజల్లులు పడ్డాయి. ఆదివారం వరకు ఉక్కపోతతో అల్లలాడిన ప్రజలు సోమవారం కురిసిన చిరుజల్లులకు ఉపశమనం పొందారు. పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దారకొండ, దుప్పిలవాడ, గుమ్మిరేవుల పంచాయతీల పరిధిలో పలు గ్రామాలలో వర్షం పడింది. గిరిజనులు ఇళ్లకే పరిమితమయ్యారు.

సంక్షేమ పాఠశాలల్లో సీట్లు పెంచాలి



కింద్ర గ్రామసభలో మాట్లాడుతున్న వెంకటరమణ

రాజవొమ్మంగి: ఆదివాసీ విద్యార్థులకు గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలల్లో తగినన్ని సీట్లు లేక వారు బీసీ వసతి గృహాల్లో చేరుతున్నారని పీసా కమిటీ సెక్రటరీ దేశగిరి వెంకటరమణ అన్నారు. సోమవారం మండలంలోని కింద్ర గ్రామంలో జరిగిన డీఏ–జాగువా (అబజన్ భగీరథ అభియాన్) గ్రామసభలో ఆయన పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గిరిజన బిడ్డల కోసం పాఠశాలల్లో సీట్లు పెంచాలని కోరారు. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంపీడీవో యాదగిరీశ్వరరావు హామీ ఇచ్చారు. రాజవొమ్మంగిలోని ఏకలవ్య పాఠశాలలో ఆదివాసీ చిన్నారులు సుద్దనీరు తాగాల్సి వస్తోంది, పరిస్థితి చక్కదిద్దాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను స్కూల్ ఎస్ఎంసీ చైర్మన్ రాజుబాబు కోరారు.